
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 17 । ఆగస్టు । 2024



22.311 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయం శుక్రవారానికి 22.311 టీఎంసీలకు చేరుకుంది. పైతట్టు నుంచి 10,047 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.72,690
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,584
3 శాతం జీఎస్టీతో	రూ.6,782
నవర (8 గ్రా)	రూ.54,256

గరిష్టం/కనిష్టం
36.4 /28.0

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. గాలో తేమ 67 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాక

వెంకటాచలం: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శనివారం వెంకటాచలం రానున్నారు. ఉదయం 10.50 సరస్వతీనగర్‌లోని అక్షర విద్యాలయం చేరుకుంటారు. అక్కడి నుంచి స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుని వేడుకల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత తిరిగి బయలుదేరుతారు. ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో వెంకటాచలంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీసీ బాలుర హాస్టల్ క్లోజ్

- జిల్లాలో నెల రోజుల్లో 13 బీసీ హాస్టళ్లు మూసివేత



ముత్తుకూరులోని బీసీ బాలుర హాస్టల్

ముత్తుకూరు: ముత్తుకూరులోని బీసీ బాలుర హాస్టల్ మూత పడింది. దీంతో మండలంలో పేద విద్యార్థుల వసతి గృహాలు పూర్తిగా అదృశ్యమయ్యాయి. తొలుత బీసీ బాలికల హాస్టల్‌ను ఎత్తివేశారు. బీసీ బాలుర సంఖ్య క్రమంగా తగ్గిపోవడంతో జిల్లాలో మొత్తం 13 బీసీ బాలుర హాస్టళ్లను జూన్‌లో మూసివేశారు. స్థానిక విద్యార్థులకు వసతి కల్పించకూడదన్న నిబంధన ఒక వైపు, ఇతర గ్రామాల విద్యార్థులు చేరకపోవడం మరో వైపు హాస్టల్ ఉనికికే చేటు తెచ్చింది. ఇక్కడ పని చేసే సిబ్బందిని పక్క మండలానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు.

పీజీపట్నం సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

పొదలకూరు: మండలంలోని ప్రభగిరిపట్నం సర్పంచ్ పీ వెంకమ్మ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీఎల్‌పీఓ ఉత్తర్వులు జారీ చేశారని ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ డీ దుర్గాదొరబాబు శుక్రవారం తెలిపారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు అందడంతో మూడు నెలల పాటు సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా మూడు రోజుల క్రితం ఇదే పంచాయతీ సెక్రటరీ పుష్పలతను రూ.1.78 లక్షల నిధులకు సంబంధించి రికార్డులు సక్రమంగా లేవని కారణం చూపుతూ డీపీఓ సస్పెండ్ చేశారు. వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. రాజకీయ కారణాలు ఉన్నట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది.

రేపు జిల్లా స్థాయి చదరంగం పోటీలు

కోవూరు: కోవూరు శ్రీచైతన్య పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి చదరంగం పోటీలు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సహకారంతో పీపుల్ ఆఫ్ చెస్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.   నగదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎటువంటి వయోపరిమితి లేదన్నారు. వివరాలకు 7032159101 నంబరులో సంప్రదించాలన్నారు.

పింఛన్ల కోతకు మౌఖిక ఆదేశాలు

- కొత్తవి మంజూరుకు ప్రతిపాదనలొద్దు

కావలి: సామాజిక పింఛన్లకు కోత పెట్టాలంటూ మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు మౌఖిక ఆదేశాలు అందాయి. ఆన్‌లైన్‌లో తొలిగింపు ఆప్షన్‌ను యాక్టివేట్ చేసినట్లు చెప్పినట్లు సమాచారం. గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులు లబ్ధిదారులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో అర్హతలు పరిశీలించి, రద్దుకు సంబంధించి నోటీసు జనరేషన్, ఫీల్డ్ వెరిఫికేషన్ ఆప్షన్లు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం పింఛను తీసుకుంటున్న లబ్ధిదారుల్లో ఎవరైనా అనర్హత కలిగి ఉన్నట్లు నిర్ధారణ అయితే గ్రామాలకు చెందిన పింఛన్లు ఎంపీడీఓలు, పట్టణాలకు చెందిన పింఛన్లు మున్సిపల్ కమిషనర్లు లాగిన్‌లో వారిని ఇనెలిజిబుల్‌గా అప్‌డేట్ చేయాలి. అలాగే కొత్త పింఛన్లు మంజూరు కోసం చేసుకున్న దరఖాస్తులను అప్‌లోడ్ చేయడానికి మాత్రం ఆప్షన్ ఇవ్వలేదని ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలియజేశారు. జిల్లాలో అన్ని రకాల సామాజిక పింఛన్లు జూన్ నెల నాటికి 3.19 లక్షల వరకు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనధికారికంగా కొన్ని తొలగించింది. ప్రస్తుతం 3,13,757 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ సంఖ్యను కూడా గణనీయంగా తగ్గించేందుకు మౌఖిక ఆదేశాలతో కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. గత ప్రభుత్వంలో ప్రతి నెలా కొత్త లబ్ధిదారులు పెరుగుతూ వచ్చారు. ప్రతి లబ్ధిదారుడికి నెలనెలా 1వ తేదీనే అందిస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం ఈ పింఛన్ మొత్తం పెంచుతామని హామీ ఇచ్చి.. ఇప్పుడు కోతలు పెడుతోంది.

పావలా కోడికి.. ముప్పావలా మసాలా..

- 7 అన్న క్యాంటీన్ల మరమ్మతులకు రూ.71.05 లక్షలు
- ఒక్కో దానికి ఒక్కో విధంగా అంచనాలు
- రూ.8.50 లక్షల నుంచి రూ.12.45 లక్షల మేర ఖర్చు
- అంచనాల్లో ఇంజినీరింగ్ అధికారుల ఇష్టారాజ్యం



అన్న క్యాంటీన్లతోనే తమ్ముళ్ల అవినీతి ప్రారంభమైంది. కలర్స్ వేసి.. కమీషన్లు దోచేశారు. ఇప్పటికే పదిలంగా ఉన్న దబ్బా రేకుల గదులకు కొత్త నిర్మాణానికయ్యేంత స్థాయిలో రూ.లక్షల్లో డబ్బు ఖర్చు పెట్టారు. నెల్లూరు నగరంలో 7 అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చేందుకు అక్షరాలా రూ.71.05 లక్షలు వ్యయం చేశారు. వాస్తవానికి ఈ క్యాంటీన్ల నిర్మాణ నమూనా ప్రకారం చూస్తే.. ఇప్పటికిప్పుడు కొత్తగా నిర్మించాలనుకుంటే రూ.13 లక్షలు కూడా ఖర్చు కాదు. కానీ టీడీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల క్రితమే రూ.46 లక్షలు కేటాయించింది. అప్పట్లోనే ఒక్కొక్క క్యాంటీన్‌పై సుమారు రూ.33 లక్షల వరకు దోచేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ అన్న క్యాంటీన్లను సచివాలయాలుగా నిర్వహించింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాడుకలో ఉన్న వీటికి రంగులు వేయడానికి టైల్స్, వాష్‌బేషిన్ వంటి చిన్నచిన్న మరమ్మతులకు ఒక్కొక్క దానికి రూ.8.50 లక్షల నుంచి రూ.12.45 లక్షల వరకు ఖర్చు చేసింది. కార్పొరేషన్‌లో సివిల్ వర్క్స్ చేసే కాంట్రాక్టర్లతో పాటు కూటమి నేతలకు మాత్రమే పనులు అప్పగించి దోచుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పావలా కోడికి.. ముప్పావలా మసాలా 'అన్న'ట్లుగా ఉంది.

– నెల్లూరు(బారకాసు)

రూ.8.50 లక్షలు



ఇది పెద్దబజార్‌లోని ఫిష్ మార్కెట్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్. దీని మరమ్మతులకు చేసిన ఖర్చు చూస్తే దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. గతంలోనూ అన్న క్యాంటీన్‌గా ఉన్న భవనాన్ని సచివాలయంగా నిర్వహిస్తున్నారు. తిరిగి అన్న క్యాంటీన్ కోసం రంగులు, టైల్స్ వేసేందుకు ఏకంగా రూ.8.50 లక్షలు ఖర్చు చేశారు.

ఔరా.. అంత వ్యయమా

రూ.12.45 లక్షలు



ఇదిగో.. ఈ ఫొటోలో కనిపిస్తున్నది నెల్లూరు తడికలబజార్ సెంటర్‌లో బాలభవన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్. ఇందులో మొన్నటి వరకు సచివాలయం నిర్వహించారు. దీన్ని అన్న క్యాంటీన్‌గా మార్చేందుకు అక్కడక్కడా పగిలిన టైల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. టాయిలెట్స్, వాష్‌బేషిన్స్ మరమ్మతులు చేశారు. రంగులు వేశారు. ఇటువంటి చిన్న చిన్న పనులకే అక్షరాలా రూ.12.45 లక్షలు ఖర్చు చేశారు.

రూ.10.50 లక్షలు



ఈ అన్న క్యాంటీన్ చూడండి. నగరంలోని ముత్తుకూరుగేట్ సెంటర్‌లో జలవనరులశాఖ కార్యాలయ ఆవరణలో గతంలో నిర్మించిన అన్న క్యాంటీన్ ఇది. ఇందులో సచివాలయం నిర్వహిస్తున్నారు. దీన్ని అన్న క్యాంటీన్‌గా రూపు మార్పు చేసేందుకు రంగులు వేసి చిన్న చిన్న మరమ్మతులకు అక్షరాలా రూ.10.50 లక్షలు ఖర్చు చేసి సిద్ధం చేశారు.

రూ.3.80 లక్షలు



కందుకూరు : కందుకూరు పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో అన్న క్యాంటీన్‌ను గతంలోనే ఏర్పాటు చేశారు. దీన్ని గత ప్రభుత్వంలో సచివాలయంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అదే భవనంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఈ భవనం మరమ్మతులు, రంగుల కోసం రూ.3.80 లక్షల వరకు అధికారులు ఖర్చు చేశారు.

రూ.19 లక్షలతో..

డైకస్‌రోడ్డులోని వెంగళ్రావునగర్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ మరమ్మతులకు రూ.9 లక్షలు వెచ్చించారు. కేవలం రంగులు అద్దడం, ఫ్లోరింగ్ మరమ్మతులు వంటి చిన్న చిన్న పనులకే రూ.లక్షలు ఖర్చు చేయడం చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగాల్సిందే. ఇక మద్రాసుబస్టాండ్ సమీపంలోని ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న భవనానికి అక్షరాల రూ.10 లక్షలు ఖర్చు పెట్టారు.

రంగులకే.. ఇంత రూ.10.30 లక్షలు



ఇదిగోండి.. నగరంలోని ఇందిరాభవన్ రోడ్డులో గతంలో అన్న క్యాంటీన్‌గా నిర్వహించిన భవనం. మొన్నటి వరకు సచివాలయంగా నిర్వహించారు. దీన్ని క్యాంటీన్‌గా తిరిగి పునఃప్రారంభించేందుకు మరమ్మతులు చేపట్టారు. ఇందుకోసం అక్షరాల రూ.10.30 లక్షలు ఖర్చు చేశారు. రంగులు వేయడానికి, మరమ్మతులకే ఇంత ఖర్చా ఔరా అంటూ ముక్కున వేలు వేసుకుంటున్నారు.

రూ.16.20 లక్షలు



కావలి: కావలి పట్టణంలోని అన్న క్యాంటీన్ సేవలకు సిద్ధం చేసేందుకు మున్సిపాలిటీ ద్వారా రూ.16.20 లక్షలు ఖర్చు చేశారు. తొలుత రూ.11.20 లక్షలు ప్రతిపాదనలు పంపించారు. సరిపోలేదని, మళ్లీ మరో రూ.5 లక్షలు ప్రతిపాదించారు. అంటే మొత్తం రూ.16.20 లక్షలు బోరు నిర్మాణం, రంగులు వేయడం, బయట ఫ్లోరింగ్, టాయ్‌లెట్స్, ప్లంబింగ్ మరమ్మతులకు ఖర్చు చేశారంట. ఈ భవనం గతంలో ఎలాంటి మరమ్మతులకు గురికాకపోవడం విశేషం.

బాగున్నదానికే.. రూ.10.30 లక్షలు



నగరంలోని పాతమున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్ భవనమిది. భవనమంతా ఎంతో భేషుగ్గా ఉంది. రంగులేసి కాస్త మెరుగులద్దే పనులకు అక్షరాలా రూ.10.30 లక్షలు ఖర్చు చేశారు. తీరా అక్కడ చేయాల్సిన పనులేమీ లేకపోవడంతో రంగలేసి రూ.లక్షలు కాజేశారని కూటమి నేతలే గుసగుసలాడుతున్నారు.

వైద్యసేవలు ఆపేసి జూడాల నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు

నెల్లూరు (అర్బన్): కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటన, అక్కడి డాక్టర్లపై జరిగిన దాడులకు నిరసనగా నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న పెద్దాస్పత్రిలో జూనియర్ డాక్టర్లు తమ వైద్య సేవలను నిలిపివేశారు. రెండో రోజు శుక్రవారం సైతం జూనియర్ డాక్టర్లు, పీజీ చేస్తున్న డాక్టర్లు మెడికల్ కళాశాల, పెద్దాస్పత్రి ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ధర్నా చేపట్టారు. రాత్రి సైతం మరో దఫా ఆస్పత్రి ప్రాంగణం నుంచి జీటీ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అయితే ఎమర్జెన్సీ సేవలకు మాత్రమే హాజరవుతున్నారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జూడా) అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జునైద్ అలీఅహ్మద్, డాక్టర్ పీర్స్ జోయల్, డాక్టర్ హితేష్ యాదవ్ మాట్లాడారు. కోల్‌కతా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మహిళా డాక్టర్‌పై పాశవికంగా అత్యా చేసి, హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు పూనుకోవడం దారుణమన్నారు. దోషులందరినీ కఠినంగా శిక్షించాలన్నారు. విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లందరికీ రక్షణ కల్పించాలన్నారు. దోషులతో పాటు కోల్‌కతాలో ర్యాలీ చేస్తున్న డాక్టర్లపై దాడులకు పాల్పడిన వారిని అక్కడి ప్రభుత్వం అరెస్ట్ చేసేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. పెద్ద సంఖ్యలో డాక్టర్లు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి, గవర్నర్ జిల్లా పర్యటనకు భారీ భద్రత



పోలీసు అధికారులు, సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్పీ

- 750 మందికిపైగా సిబ్బందితో బందోబస్తు

నెల్లూరు (క్రైమ్): భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖడ్, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ జిల్లా పర్యటన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఆద్యంతం సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. 750 మందికి పైగా పోలీస్ సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. ఉపరాష్ట్రపతి, గవర్నర్ పర్యటించే ప్రాంతాలన్నింటిని శుక్రవారం ఉదయం నుంచే పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బాంబ్, డాగ్‌స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ముందస్తు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ట్రయల్ కాన్వాయ్ నిర్వహించారు. స్థానిక పోలీసు కవాతు మైదానంలో బందోబస్తు విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, వ్యతిరేక దిశలో వాహనాల కదలికలను పూర్తిగా నిరోధించాలన్నారు. అందరూ సమయపాలన పాటిస్తూ డ్యూటీ పాస్‌పోర్టులో ఎవరికి కేటాయించిన ప్రదేశాల్లో వారు తప్పక విధులు నిర్వహించాలన్నారు. విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

15 శాతం వృద్ధి రేటు సాధించాలి

- కలెక్టర్ ఆనంద్



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని ప్రతి ప్రభుత్వశాఖల్లో రాబోయే ఐదేళ్లలో 15 శాతం వృద్ధి రేటు సాధించడానికి అధికారులందరూ ప్రత్యేక కార్యాచరణతో సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వికసిత్ ఆంధ్ర 2047 ప్లాన్ అమలుపై జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమల అనుబంధ రంగాలు, సేవా రంగాల్లో వృద్ధి రేటు సాధించడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. 2024 నాటికి పర్ కాపిటల్ ఇన్‌కం రూ.45 వేలు చేయడం ప్రభుత్వ లక్ష్యంగా కలెక్టర్ చెప్పారు. సామాజిక, భౌతిక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం, ప్రైవేట్, పబ్లిక్ పార్టనర్ షిప్ పీ4 మోడల్ అమలు చేయాలన్నారు. ఫిజికల్ ఫైనాన్షియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌లో పీ 3 మోడల్ అమలు చేయాలని సూచించారు. విద్య, వైద్యం, భూమి కొనుగోలు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలన్నారు. సెప్టెంబర్ 10 నుంచి 14వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు, 10 నుంచి 15 వరకు ప్రజలకు వికసిత్ ఆంధ్ర–2047 కార్యక్రమంపై అవగాహన కల్పించాలని అధికా రులకు సూచించారు. చీఫ్ ప్లానింగ్ అధికారి సాలెం రాజు అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీపీఓ సుస్మిత, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, నుడా వీసీ బాపిరెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, డ్వామా పీడీ శ్రీనివాసులు, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ పాల్గొన్నారు.

నేటి నుంచి 24 గంటలు ప్రైవేట్ వైద్యసేవలు బంద్

- ఎమర్జెన్సీ సేవలకు మినహాయింపు

నెల్లూరు (అర్బన్): కోల్‌కతాలో జరిగిన వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనకు సంబంధించి న్యాయం కోరుతూ ప్రభుత్వ వైద్యశాలలతో పాటు అన్ని ప్రైవేట్ వైద్యశాలల్లో సైతం శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు (24 గంటలు) అన్ని రకాల సాధారణ వైద్య సేవలను, అత్యవసరం కాని ఆపరేషన్లను నిలిపేస్తున్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి డాక్టర్ ఎంఎస్ రెడ్డి, డాక్టర్ రాహుల్ బాబు, డాక్టర్ రామమోహన్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అయితే ఎమర్జెన్సీ వైద్య సేవలకు మినహాయింపు ఉంటుందన్నారు.

తల్లిదండ్రులు, గురువుల రుణం తీర్చుకోలేనిది



మెట్టు రామచంద్ర ప్రసాద్‌ను జానకీరామశర్మ స్మారక పురస్కారంతో సత్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తదితరులు

- విద్య, సంస్కృతి, సంప్రదాయాలు భావితరాల మనుగడకు పునాదులు
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ఘనంగా 'పోలూరి' శతజయంతి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): విద్యతో పాటు సంస్కృతిని అభ్యసించి, సంప్రదాయాలను పాటించడం ద్వారా తమ మనుగడతో పాటు దేశ గౌరవాన్ని ఇనుమడింపజేసిన వారమవుతామని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నగరంలోని పురమందిరంలో శుక్రవారం రాత్రి తెలంగాణ సారస్వత పరిషత్, పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీ రామశర్మ శత జయంతిని పురస్కరించుకుని తన గురువు మెట్టు రామచంద్రప్రసాద్‌కు జానకీరామశర్మ స్మారక పురస్కారాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. ఆకాశవాణి సంచాలకులు డాక్టర్ రేవూరి అనంతపద్మనాభరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కుటుంబ విలువలు, గురువుపై గౌరవమే దేశ ఉన్నతిని పెంచాయన్నారు. నేటితరం విద్యార్థులకు చదువుతో పాటు సంస్కృతిని నేర్పాలన్నారు. నెల్లూరుకు చెందిన మణిదీపాల్లో హనుమజ్జానకీరామశర్మ ఒకరన్నారు. ఆయన వద్ద తాను విద్యనభ్యసించడం, ఆయన వద్ద విద్యనభ్యసించిన మెట్టు రామచంద్రప్రసాద్ సైతం తనకు గురువు కావడం ఒక గురువును స్మరిస్తూ మరొక గురువుకు గురువు పేరుతో ఉన్న పురస్కారం అందజేయడం తన అదృష్టంగా భావిస్తూ తనకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ సాక్షాత్తు బ్రహ్మీయమూర్తని, విష్ణు పదార్చన చేసి సాహిత్యంతో పరమేశ్వరుడిని అభిషేకించిన మహోన్నతులన్నారు. తాను డిగ్రీ చదివే రోజుల్లో తెలుగుభాష, సాహిత్యంపై మక్కువ కలిగేందుకు తన ఎదుగుదల్లో అమ్మమ్మ, తాతయ్య తర్వాత గురువు హనుమజ్జానకీరామశర్మ పాత్ర చిరస్మరణీయమన్నారు. పురస్కారాన్ని అందుకున్న తన గురువు మెట్టు రామచంద్రప్రసాద్ సైతం హనుమజ్జానకీరామశర్మ మాదిరి జీవితాన్ని సాహిత్యానికి, విద్యా రంగానికి అంకితం చేశారని కొనియాడారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ వీఆర్ కళాశాలలో 50 ఏళ్ల క్రితం తమకు విద్యాబోధన చేసిన తమ గురువు హనుమజ్జానకీరామశర్మ ప్రకాశం జిల్లా వాసి అని, ఆయన శత జయంతి నెల్లూరులో నిర్వహించడం తాను ఒంగోలుకు ఎంపీని కావడం యాదృచ్ఛికమై, గురు ఆశీర్వచనమేనన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. తొలుత మాజీ ఉపరాష్ట్రపతికి, సన్మాన గ్రహీత రామచంద్రప్రసాద్‌కు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా వర్ధమాన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం



రాష్ట్ర గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ వేడుకల్లో పాల్గొనేందుకు నెల్లూరుకు చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులకు ఘన స్వాగతం లభించింది. విజయవాడ నుంచి రైల్లో బయలుదేరిన గవర్నర్ దంపతులు శుక్రవారం రాత్రి నెల్లూరు చేరుకున్నారు. నెల్లూరు రైల్వే స్టేషన్‌లో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ గవర్నర్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. శనివారం ఉదయం వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకల్లో గవర్నర్ దంపతులు పాల్గొంటారు. గవర్నర్ దంపతులకు స్వాగతం పలికిన వారిలో జేసీ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, ఆర్డీఓ మలోల తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆరుగురు సీఐల బదిలీ

నెల్లూరు(క్రైమ్): గుంటూరు రేంజ్ పరిధిలో ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న వేణును నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు.. అక్కడ విధుల్లో ఉన్న మారుతికృష్ణను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న సుభానీని నెల్లూరు నార్త్ ట్రాఫిక్‌కు.. అక్కడ విధుల్లో ఉన్న శివాజీని రేంజ్ వీఆర్‌కు.. రేంజ్ వీఆర్‌లో ఉన్న రాజేశ్వరరావును కావలి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు, అక్కడ విధుల్లో ఉన్న శ్రీనివాసరావును రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. వీరు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మర్రిపాడు: మర్రిపాడు సమీపంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బద్వేల్ వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం కనుగొన్నారు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. రెండు రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడ్ని దివ్యాంగుడిగా గుర్తించారు. వివరాలు తెలిసిన వారు మర్రిపాడు పోలీసులను సంప్రదించాలని కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): తలకు తీవ్రగాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు శుక్రవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళెం గేటుకు వెళ్లే రహదారిలో గుర్తుతెలియని 70 ఏళ్ల వృద్ధుడు ఈ నెల ఆరున ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడటంతో తలకు గాయమైంది. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో స్థానికులు చేర్పగా, అక్కడ మృతి చెందారు. మృతదేహాన్ని మార్చురీకి దర్గామిట్ట పోలీసులు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య



కావలి: పట్టణంలోని ముసునూరు వద్ద రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఇనుప కర్ర లభ్యమైంది. తెలుపు చొక్కా, పంచె, టవల్‌ను ధరించి ఉన్నారు. మృతుడికి 70 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితులను చిన్నబజార్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సర్వేపల్లి కాలువకట్టకు చెందిన పెయింటర్ శ్రీనివాసులుకు అదే ప్రాంతానికి చెందిన నితిన్, కిరణ్, తేజ, సాయి స్నేహితులు. వీరి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ తరుణంలో సోమశేఖరపురంలోని నారాయణ సమోసా దుకాణ సమీపంలో శ్రీనివాసులుపై ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి వీరు దాడి చేసి గాయపర్చారు. క్షతగాత్రుడి సోదరుడు ముకేష్‌బాబు ఫిర్యాదు మేరకు నిందితులపై చిన్నబజార్ పోలీసులు హత్యాయత్నం కేసును నమోదు చేశారు. పరారీలో ఉన్న నలుగుర్ని అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్వామివారికి తిరుమంజనం, హోమాలు, గోపురోత్సవాన్ని శుక్రవారం జరిపారు. ఉభయకర్తలుగా ఆరణి కందప్ప మేస్త్రి సత్ర ఈఓ వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:112
లేయర్ (లైవ్)	:100
బ్రాయిలర్ చికెన్	:210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:230
లేయర్ చికెన్	:170



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	:రూ.90
సన్నవి	:రూ.50
పండ్లు	:రూ.35



సచివాలయ అడ్మిన్లపై కక్ష

నగరపాలక సంస్థలో వింతపోకడ
- ఒకరికి వారం రోజులుగా వరుసగా షోకాజ్ నోటీసులు
- తీవ్ర మానసిక ఒత్తిడితో సతమతం



నగరపాలక సంస్థ కార్యాలయం

నెల్లూరు(బారకాసు): వార్డు సచివాలయాల్లో అడ్మిన్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులపై కార్పొరేషన్ అధికారులు కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఓ వార్డు సచివాలయానికి సంబంధించిన అడ్మిన్‌కు వారం రోజుల పాటు వరుసగా షోకాజ్ నోటీసులను జారీ చేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలతో సదరు ఉద్యోగి తీవ్ర మానసిక ఒత్తిడితో ఉన్నారు.

మొత్తం 141 మంది అడ్మిన్లు

నగరపాలక సంస్థ పరిధిలోని 166 సచివాలయాలకు గానూ దాదాపు 141 మంది అడ్మిన్లు ఉన్నారు. వీరు ప్రధానంగా ఆస్తి, కుళాయి పన్నులను వసూలు చేయడంతో పాటు సచివాలయ ఉద్యోగుల హాజరు నిర్వహణ వంటి విధులను నిర్వర్తించాలి.

పన్నుల వసూళ్లలో వెనుకబడ్డారంటూ..

ఇంటి పన్నుల వసూళ్లలో వెనుకబడ్డారంటూ అడ్మిన్లను సాయంత్రం ఐదు గంటల తర్వాత కార్పొరేషన్ కార్యాలయానికి పిలిచి మందలిస్తున్నారని సమాచారం. ఇదే తంతు వారం రోజులుగా జరుగుతోందని తెలుస్తోంది. మహిళా ఉద్యోగులను రాత్రి ఎనిమిది గంటల వరకు కార్యాలయంలో ఉంచుతున్నారు. సచివాలయంలో జరిగే ప్రతి పనికీ అడ్మిన్లను వేధించడం ఎంత వరకు సబబని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

సమావేశానికి రాలేదని షోకాజ్ నోటీసులు..!

తాజాగా రెండో శనివారం సందర్భంగా నిర్వహించిన సమావేశానికి హాజరుకాలేదంటూ 69 మంది అడ్మిన్లకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ పరిణామం ఉద్యోగుల్లో అసహనాన్ని పెంచింది. ఓ అధికారి అత్యుత్సాహంతో చేసిన నిర్వాకంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు, ఆర్‌ఐలు, ఏఈ హాజరుకాకపోయినా, కేవలం తమపై కక్షపూరితంగా వ్యవహరించడం శోచనీయమని అడ్మిన్లు పేర్కొంటున్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే కూల్చేస్తాం

- అక్రమ కట్టడాల విషయంలో రాజీపడేదిలేదు
- గతంలో నిర్మించిన వాటిపై త్వరలోనే నిర్ణయం
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీల పరిధిలో భవన నిర్మాణాల్లో నిబంధనలను అతిక్రమిస్తే వాటిని కూల్చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ విభాగాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరాభివృద్ధికి గానూ నగరపాలక సంస్థలోని అన్ని విభాగాలు సమన్వయంతో కృషి చేయాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణను సమర్థంగా జరిపేందుకు..

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన నూతన వాహనాలు, చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. పందులు, కుక్కలు, కోతుల నియంత్రణతో పాటు రోడ్లపై పశువులు సంచరించకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో సమస్యలను పరిష్కరించి, ఆన్‌లైన్ విధానాన్ని మాత్రమే పాటించాలని చెప్పారు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే విషయమై వివిధ అభివృద్ధి చెందిన దేశాల్లో వినియోగిస్తున్న ఆధునిక యంత్రాలను నగరంలో ఏర్పాటు చేసేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. నగరాభివృద్ధికి అవసరమైన నూతన సౌకర్యాలను కల్పించేందుకు వివరాలను సేకరించాలని సూచించారు. సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడి, వారి విధులను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరును మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

పారదర్శకంగా అన్ని సేవలు

టౌన్‌ప్లానింగ్ విభాగంలోని అన్ని సేవలు పారదర్శకంగా ఉండేలా ఆన్‌లైన్ విధానాన్ని పాటించాలని తెలిపారు. నూతన లేఅవుట్లలో పాటించాల్సిన ప్రమాణాలు అమలయ్యేలా ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్, ఫైర్, రెవెన్యూ విభాగాలను అనుసంధానం చేసి భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల మంజూరును సులభతరం చేయనున్నామని ప్రకటించారు.

పారిశుధ్య చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

నగరంలో పారిశుధ్య నిర్వహణ విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంహెచ్‌ఓ చైతన్య వివరించారు. కమిషనర్ సూర్యతేజ, అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్‌ఈ సంపత్‌కుమార్, సిటీ ప్లానర్ దేవీకుమారి, టీపీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణకు టీకా తప్పనిసరి



వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో టీబీని నివారించాలనే లక్ష్యంతో పెద్దలకు తొలిసారిగా వ్యాక్సిన్‌ను వేస్తున్నారని, దీన్ని తప్పక వేయించుకోవాలని ఏడీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ కోరారు. జనార్దన్‌రెడ్డికాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ ప్రక్రియను శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, సూపర్‌వైజర్ వేణుగోపాల్, హిమధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈకి సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్‌ను విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయ భవనంలో శుక్రవారం సత్కరించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు చేతుల మీదుగా అవార్డును అందుకున్న నేపథ్యంలో కోవూరు డివిజన్ ఈఈ రమేష్‌చౌదరి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సర్కిల్‌కు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, అందరి కృషి ఫలితంగా ఇది దక్కిందని ఎస్‌ఈ తెలిపారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు శేషాద్రిబాలచంద్ర, సునీల్, సతీష్, శీనయ్య, ఏఈ మెహబత్‌సింగ్ తేజశృతి తదితరులు పాల్గొన్నారు.

పొన్నవోలు ప్యానల్ విజయం

- నెల్లూరు క్లబ్ పాలకవర్గానికి ఎన్నికలు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు క్లబ్ పాలకవర్గానికి సంబంధించిన ఎన్నికల ప్రక్రియ గురువారం అర్ధరాత్రితో ముగిసింది. పోటీలో పొన్నవోలు సుధాకర్‌రెడ్డి.. ఇసనాక సునీల్‌రెడ్డి ప్యానళ్లు తలపడ్డాయి. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాల వివరాలను వెల్లడించారు. పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్యానల్ విజయం సాధించగా, ఇసనాక సునీల్‌రెడ్డి ప్యానల్ డిపాజిట్ సైతం దక్కించుకోలేకపోయింది. పొన్నవోలు ప్యానల్ వరుసగా మూడోసారి విజయం సాధించింది. ఇదే ప్యానల్‌లో ఈసీ సభ్యుడిగా పోటీ చేసిన కొప్పాల లీలామోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సమయంలో మృతి చెందిన విషయం విదితమే. ఎన్నికల్లో ఈయన గెలుపొందారు. సర్వసభ్య సమావేశం అనంతరం నిర్వహించే పాలకవర్గ సమావేశంలో అందరి సమ్మతితో మరో వ్యక్తిని ఎన్నుకోనున్నారు. పాలకవర్గ కమిటీ అధ్యక్షుడిగా కొడేటి శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వీరేపల్లి అశోక్, కార్యదర్శిగా పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, కోశాధికారి పోకిరెడ్డి శ్రీహరిరెడ్డి ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా జెట్టి సురేష్‌రెడ్డి, కంది విజయభాస్కర్‌రెడ్డి, కిలారి దినేష్, కారంశెట్టి ప్రవీణ్‌కుమార్, శోభన్‌బాబు, పాముల రమణయ్య, కొప్పాల లీలామోహన్‌రెడ్డి గెలుపొందారు. కాగా ఆదివారం నిర్వహించనున్న సర్వసభ్య సమావేశం అనంతరం పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని సమాచారం.

పూల ధరలు పైపైకి..



ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పూల మార్కెట్లో సందడి

- చామంతి, రోజా కిలో రూ.300
- బంతి కిలో రూ.80 నుంచి రూ.100 వరకు
- శ్రావణ శుక్రవారం, వరుస శుభకార్యాల ప్రభావం
- కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్

నెల్లూరు(బారకాసు): శ్రావణ శుక్రవారం, వరుస శుభకార్యాల నేపథ్యంలో పూల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధరలు విని గుడ్లు తేలేయడం కొనుగోలుదారుల వంతవుతోంది. వాస్తవానికి నెల్లూరుకు పూలు బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా వస్తుంటాయి. ప్రస్తుతం శ్రావణమాసం కావడంతో శుభకార్యాలు చేసుకునేందుకు అనుకూలమైంది. దీంతో పూల ధరలకు రెక్కలొచ్చాయి. మరోవైపు కొనుగోలుదారులతో ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పూల మార్కెట్ కిటకిటలాడుతోంది.

ధరలిలా..

చామంతి, రోజా పూలు పావు కిలో రూ.80.. కిలోను రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. బంతిపూలు కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. కనకాంబరం, మల్లె పూల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. శుభకార్యాలు ఉండటంతో ఎంత వెచ్చించైనా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి



సమావేశంలో చర్చిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలోని కౌలు రైతులకు యజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులను ఇవ్వాలని కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య డిమాండ్ చేశారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కౌలు రైతులను ఆదుకుంటామని ఎన్నికల సమయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారని, ఈ క్రమంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలను భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని కౌలు రైతులతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసనను త్వరలో చేపట్టనున్నామని చెప్పారు. కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి రాజగోపాల్, నేతలు వెంకటేశ్వర్లు, దర్గాబాబు, హరి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నిషేధమున్నా.. ఆగని చేపల వేట



సోమశిల జలాశయ వెనుక భాగంలో చేపల వేట

సోమశిల: సోమశిల జలాశయంలో మత్స్య సంపద మరింతగా పెరిగేందుకు గానూ చేపల వేటను జూలై నుంచి ఆగస్టు 31 వరకు అధికారులు నిషేధించారు. జలాశయంలో కిలోమీటర్ మేర చేపల వేటను నిషేధించామని మత్స్యశాఖ అధికారులు చెప్తున్నా, అది వాస్తవ విరుద్ధంగా ఉంటోంది. స్థానిక మత్స్యకారులు జలాశయ వెనుక వైపు కడప జిల్లా నుంచి సైతం వేటను సాగించి ఇతర రాష్ట్రాలకు రాత్రి వేళ తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సమాచారమిచ్చినా, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పోలీసుల అదుపులో మత్స్యకారుడు

చేపల వేట సాగించి ఒడ్డుకొచ్చిన ఓ మత్స్యకారుడ్ని సోమశిల ఎస్సై సుబ్బారావు శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు దోసెల సుబ్బారావు, వీరబాబుపై కేసు నమోదు చేశారు.



పోలీసుల అదుపులో మత్స్యకారుడు

గృహ ప్రవేశానికి మామిడాకులు తెచ్చేందుకెళ్లి..

- విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం

లింగసముద్రం: నూతనంగా నిర్మించిన ఇంట్లోకి అడుగిడాలని ఎన్నో కలలుగన్నారు.. అయితే ఆ స్వప్నం నెరవేరకుండానే విధి వక్రీకరించి విద్యుదాఘాతం వ్యక్తిని కబళించిన హృదయవిదారక ఘటన మండలంలోని ఆర్‌ఆర్‌పాళెంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. ఆర్‌ఆర్‌పాళెం ఎస్సీ కాలనీలో యడవల్లి రమేష్ (40) నూతనంగా ఇంటిని నిర్మించుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఇంట్లో చేరేలా కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొత్త ఇంట్లో చేరేందుకు మామిడాకులు అవసరం కావడంతో తీసుకొచ్చేందుకు మరో వ్యక్తితో కలిసి బైక్‌పై మొగిలిచర్ల – తాతా హోటల్ రోడ్డుకు దగ్గర్లోని తోట వద్దకెళ్లారు. మామిడాకులు కోసేందుకు రమేష్ ఒక్కరే వెళ్లారు. ఈ తరుణంలో అడవి పందుల వేట కోసం గుర్తుతెలియని వ్యక్తులు 11 కేవీ విద్యుత్ తీగలను తోటలో ఏర్పాటు చేశారు. చీకట్లో గమనించని రమేష్ విద్యుత్ తీగలకు తగిలి.. కేకలేస్తూ అక్కడికక్కడే మృతి చెందారు. రోడ్డుపై ఉన్న వ్యక్తి విషయాన్ని కాలనీ వాసులకు తెలియజేశారు. దీంతో వారు రమేష్ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. మృతుడి భార్యాపిల్లలు, కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు.

దుస్తులు ఆరేస్తూ..

- రెండో అంతస్తు నుంచి పడి మహిళ మృతి

ఆత్మకూరు: దుస్తులు ఆరేస్తూ ప్రమాదవశాత్తూ జారి రెండో అంతస్తు నుంచి కిందపడి వివాహిత మృతి చెందిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఆర్టీసీ ఉద్యోగి సునీల్, మనోజ (35) దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో మనోజ తాము ఉంటున్న భవన రెండో అంతస్తులో దుస్తులను ఆరేయసాగారు. ఈ తరుణంలో మేడపై నుంచి తీగలను తాకుతూ కింద పడటంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. మృతురాలికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.